ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | ఆదివారం | 16.08.2026 | సంపుటి : 2 | సంచిక : 45 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## ఆహార, ఔషధ కల్తీలపై
# ఉక్కుపాదం

నాణ్యత, ప్రమాణాలే లక్ష్యంగా 'టీజీ సేఫ్'

ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాల విలీనం

ఏకీకృత వ్యవస్థకు కమిషనర్‌గా అవినాశ్ మహంతి

తొలుత 'క్యూర్' పరిధిలో అమలు



హైదరాబాద్, ఆగస్ట్ 16 : ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రోజురోజుకూ పెచ్చుమీరుతున్న ఆహార, ఔషధ కల్తీలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. ఆహార, ఔషధాల నాణ్యతను

-మిగతా 2 లో..

## బీసీల కులగణనపై
# కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

మంత్రి పొన్నం విమర్శ..

ఈ అంశంపై ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు వెల్లడి



హైదరాబాద్, ఆగస్ట్ 16 : బీసీల కులగణనపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బీసీ అని చెప్పుకొంటున్న ప్రధాని మోదీ బీసీ కులగణనపై మాట్లాడటం లేదని ఆయన విమర్శించారు. జనగణనలో బీసీ కులగణన లెక్కలు తేల్చాలని తాను ప్రధానికి లేఖ రాసినట్లు మంత్రి ఆదివారం

-మిగతా 2 లో..




## నేటి నుంచి మండల స్థాయిలో
# ప్రజావాణి

రాష్ట్రవ్యాప్తంగా 620 మండలాల్లో ఏర్పాట్లు

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు అర్జీల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్ట్ 16 : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ఈ మేరకు 620 మండలాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలు స్వీకరించి, నమోదు చేయడంతో పాటు సంబంధిత రిజిస్ట్రేషన్ నంబరును సైతం అర్జీదారులకు అందజేస్తారు. రాష్ట్రస్థాయి ప్రజావాణిలో ప్రతి వారం అర్జీలు పెరుగుతున్నాయి. వీటిలో 70 శాతం మండల స్థాయివే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో మండలస్థాయికి ప్రజావాణిని

-మిగతా 2 లో..

## మీ పాలన.. మా పాలనపై
# అసెంబ్లీలో చర్చిద్దాం

కేసీఆర్‌ది కుటుంబ పాలన.. నాది సామాజిక పాలన

మా ప్రభుత్వంలో ఆడబిడ్డలు, ఉద్యమకారులకు అవకాశాలు

సమ్మక్క-సారలమ్మ ఆశీస్సులతో ఇందిరమ్మ రాజ్యం

రైతులు, మహిళలు, నిరుద్యోగుల సంక్షేమమే మా ఎజెండా

సెప్టెంబర్‌లో అసెంబ్లీ పెడతా.. అన్ని లెక్కలు అక్కడ మాట్లాడతాం

మేడారం, ములుగు, పరకాల పర్యటనల్లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హ్యామ్‌రోడ్ల పైలాన్ ఆవిష్కరణ.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వరంగల్, ఆగస్ట్ 16 : "కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో చర్చిద్దామంటూ బావ, బావమరిది సవాళ్లు విసురుతున్నారు. సెప్టెంబరులో సభ నిర్వహిస్తాం. వారి పాలనలో ఏం చేశారో.. మేం చేసిన అభివృద్ధి ఏమిటో చర్చిద్దాం. కేసీఆర్‌ను కూడా సభకు తీసుకురావాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ములుగు, హనుమకొండ జిల్లాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం.. ములుగు కలెక్టరేట్ వద్ద, పరకాలలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రగతి బాట బహిరంగ సభలో ప్రసంగించారు. భారాస వైఖరిపై.. కేసీఆర్ కుటుంబంపై ధ్వజమెత్తారు. "కేసీఆర్ హయాంలో ఆయన కుటుంబంలోని కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్, కవితకు

-మిగతా 2 లో..




## కళ్యాణలక్ష్మి రద్దుకు
# కాంగ్రెస్ కుట్ర

హైకోర్టు తీర్పును సాకుగా చూపి పథకాన్ని ఎత్తివేసే యత్నం

తులం బంగారం హామీ నుంచి తప్పించుకునేందుకే ఈ కుట్ర

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు.. కేటీఆర్ పిలుపు

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు చేస్తున్న ప్రభుత్వ పన్నాగాన్ని అడ్డుకోవాలన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో భారాస పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

హైదరాబాద్, ఆగస్ట్ 16 : పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో ఆదివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. "కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. పేద కుటుంబాల

-మిగతా 2 లో..

## 1,000 పడకల టిమ్స్
# ప్రారంభం నేడే



'డా.ఎంసీఆర్ టిమ్స్'ను ప్రారంభించనున్న సీఎం

అందుబాటులోకి ఆధునిక వైద్యశాల

హైదరాబాద్, ఆగస్ట్ 16 : హైదరాబాద్ ఎర్రగడ్డలో నిర్మించిన మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా.ఎంసీఆర్ టిమ్స్) సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సోమవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాయంత్రం 4.30 గంటలకు టిమ్స్‌ను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరు కానున్నారు. మొత్తం 22.6 ఎకరాల్లో రూ. 1,100 కోట్ల వ్యయంతో టిమ్స్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. వెయ్యి పడకలతో అత్యాధునికంగా నిర్మించిన టిమ్స్‌లో ఐదు బ్లాకుల్లోని అన్ని

-మిగతా 2 లో..



## దేశ భద్రత విషయంలో
# రాజీ లేదు

హైదరాబాద్, ఆగస్ట్ 16 : దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) శిక్షణ కేంద్రంలో గార్డ్స్ కుటుంబాల కోసం నిర్మించిన 48 గృహ సముదాయాలను ఎన్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్ సంజయ్ సింఘాల్‌తో కలిసి కేంద్ర మంత్రి ఆదివారం ప్రారంభించారు.

-మిగతా 2 లో..




## కిరాణ దుకాణానికి వచ్చే
# ఒంటరి మహిళలే టార్గెట్

సిద్దిపేటలో లేడీ కిల్లర్

మైనర్ కుమారుడితో కలిసి ఘాతుకాలు

ఇప్పటి వరకు ఇద్దరి దారుణ హత్య.. మరో నలుగురి హత్యకు ప్లాన్

కేసు వివరాలు వెల్లడించిన సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, ఆగస్ట్ 16 : డబ్బు, బంగారం కోసం వరుస హత్యలకు పాల్పడుతున్న లేడీ కిల్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏసీపీ రవీందర్‌రెడ్డితో కలిసి సీపీ రష్మీ పెరుమాళ్ కేసు వివరాలను వెల్లడించారు. దుబ్బాక మండలం రామక్కపేట గ్రామ శివారు రోడ్డు పక్కన ఈ నెల 8న పాక్షికంగా కాలిపోయిన గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు భూంపల్లిలోని డబుల్ బెడ్రూం కాలనీలో నివాసముండే అతికం విజయ (45)గా పోలీసులు

-మిగతా 2 లో..



# కల్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలు. పేదల ఇళ్లలో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్.. తెలంగాణ ఏర్పడిన వెంటనే 2014 అక్టోబరు 2న ఈ పథకాలు ప్రారంభించారు. రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభించిన ఈ పథకాలను దశల వారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేరకు ఆర్థికసాయం అందింది. కొవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచింది. అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు.. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి.. దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోంది. నాలుగుసార్లు హైకోర్టు గడువు ఇచ్చినా.. ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదు? ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయింది? ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో.. ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోంది" అని కేటీఆర్ ఆరోపించారు.



# దేశ భద్రత విషయంలో రాజీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో అక్రమ వలసలను నిరోధించడంతోపాటు ఉగ్రవాదులు, తీవ్రవాదుల నిర్మూలనలో ఎన్ఎస్జీ కమాండోలు, ఇతర జవాన్ల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. నిరంతరం సరిహద్దుల్లో దేశ భద్రతను కాపాడుతున్న జవాన్ల కుటుంబాలు సురక్షితంగా.. సౌకర్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశ రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని... సరిహద్దు భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నిఘా వ్యవస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రధాని నాయకత్వంలో కేంద్ర హోంశాఖ మార్గదర్శకత్వంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఆధునికీకరణతో పాటు జవాన్ల సంక్షేమానికి ఆధునిక గృహ వసతి, వైద్య సదుపాయాలు, పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు.

# రైలు దిగి పట్టాలు దాటుతుండగా.. మరో రైలు ఢీకొని యువతి మృతి

**హైదరాబాద్, ఆగస్టు 15 :** తల్లిదండ్రులతో కలిసి రైలు దిగి పట్టాలు దాటుతుండగా.. మరో రైలు ఢీకొన్న ఘటనలో ఓ యువతి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మౌలాలి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్ గౌడ్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా నేరేడుమెట్లకు చెందిన ప్రకాశ్, జ్యోతి దంపతులు కొంతకాలంగా మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె మానస (20) నెల రోజుల క్రితమే నర్సు శిక్షణ పూర్తి చేసుకుంది.



కుటుంబ సభ్యులు కలిసి జనగామలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి.. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. మౌలాలి రైల్వేస్టేషన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి రైలు దిగిన మానస.. రెండో నంబరు ప్లాట్‌ఫాం నుంచి 1వ నంబరుకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో దూసుకొచ్చిన విశాఖ- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. రెప్పపాటులో జరిగిన ఈ విషాద ఘటనతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

# బీసీల కులగణనపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

(మొదటిపేజీ తరువాయి)

గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో తెలిపారు. 'దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన మొదటిదశ ఇళ్ల సర్వేలో ఎస్సీ, ఎస్టీల వివరాలు సేకరించారు. ఇక రెండో దశలో బీసీల వివరాలు సేకరిస్తామన్నారు. కానీ రెండోదశ జనగణనకు కేంద్రం విడుదల చేసిన 40ప్రశ్నలలో ఓబీసీ అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ఇది తీవ్ర ఆక్షేపణీయం. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు రిజర్వేషన్లకు వ్యతిరేకం. కులగణనపై భాజపా వైఖరి ఏంటి' అని మంత్రి ప్రశ్నించారు. ప్రధానికి రాసిన లేఖలో బీసీల కులగణనకు సంబంధించి కీలక సూచనలు చేసినట్లు తెలిపారు. 'జనాభా లెక్కల ప్రశ్నావళిలో బీసీ కులాలకు స్పష్టమైన ప్రత్యేక కేటగిరీని ఏర్పాటుచేయాలి. 2011 సామాజిక-ఆర్థిక, కులగణనలో కులాల పేర్ల విషయంలో ఎదురైన సమస్యలు 2027జనాభా లెక్కల్లో పునరావృతం కాకుండా పారదర్శక విధానాన్ని అనుసరించాలి. కులాలు, సామాజిక సముదాయాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్ కేటాయించాలి' తదితర సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని.. సభలు, సన్మానాల సమయంలో అతిథులకు జ్ఞాపికలకు బదులు.. చేనేత తువాళ్లను బహూకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత శాఖ ఆదివారం నిర్వహించిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత రంగాన్ని మా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

# మీ పాలన.. మా పాలనపై అసెంబ్లీలో చర్చిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పదవులిచ్చి కుటుంబానికే న్యాయం చేశారు. నేను ముఖ్యమంత్రి అయ్యాక సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ మంత్రులయ్యారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు తీసుకున్నారు. అందుకే ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. తండ్రీకొడుకులు(కేసీఆర్, కేటీఆర్‌నుద్దేశించి) రాష్ట్రాన్ని పీడిస్తున్నారు. రాష్ట్రంలో వర్షాలు కురవొద్దని తమిళనాడు, కర్ణాటకకు వెళ్లి మేనల్లుడు క్షుద్రపూజలు చేశారు. భారాస హయాంలో ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్న పత్రాలు అమ్ముడయ్యాయి. విద్యకు సంబంధించి పరీక్షల ప్రశ్న పత్రాలు లీకేజీలమయంగా మారాయి. యువత ప్రతిపక్షం మాటలు నమ్మి కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగాలు సాధించే అవకాశాలు కోల్పోతారు. యువత భవిష్యత్తు కోసం మా ప్రభుత్వం అన్నివిధాలా ఆలోచిస్తోంది. నాటి తెలంగాణ ఉద్యమంలోనూ వీరు రెచ్చగొట్టడం వల్లే ఆత్మబలిదానాలు జరిగాయి. కేసీఆర్ కుటుంబంలో ఎవరికైనా చిన్న గాయమైందా. తెలంగాణ భవన్‌లో ఇటీవల రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్ ఆ రోజు ఎందుకు రక్తదానం చేయలేదు. కార్యకర్తలు ఇచ్చిన రక్తాన్ని ప్రైవేటు ఆసుపత్రిలో అమ్ముకున్నారు "అని సీఎం విమర్శించారు. "భారాస తొలి ప్రభుత్వంలో మహిళా మంత్రులను నియమించలేదు. కల్వకుంట్ల కుటుంబంలో జైలుకెళ్లి కష్టాల్లో ఇంటికి తిరిగొచ్చిన ఆడబిడ్డను ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని తరిమేశారు. ఈ తప్పిదంలో కేసీఆర్‌కూ భాగముంది. ఇంటి ఆడబిడ్డకే న్యాయం చేయలేని వారు రాష్ట్రంలోని మహిళలకు ఏం న్యాయం చేస్తారు. మేం నర్సరీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్య కోసం యంగ్ ఇండియా పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలి. ఇంటర్ తర్వాత సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకుంటే జపాన్, జర్మనీ, కొరియా



వంటి దేశాల్లో మంచి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. నేను గ్రామీణ ప్రాంతం నుంచే వచ్చా.. కష్టాలు నాకు కొత్తకాదు.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారితో కలిసే పెరిగా..పాలమూరంటేనే కష్టాలుండేవి. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ హామీని సక్రమంగా అమలు చేయలేదు. మేం రూ.2 లక్షలు ఒకేసారి మాఫీ చేశాం. రుణమాఫీ, పంటల కొనుగోలు, బోనస్, ఉచిత విద్యుత్తు తదితర పథకాల కింద రైతుల సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చాం. రాష్ట్ర శ్రేయస్సు కోసం 18 గంటలు కష్టపడుతున్నా"అని ముఖ్యమంత్రి చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, వేంనరేందర్‌రెడ్డి, విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మురళీనాయక్, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, యశస్విినిరెడ్డి, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆహార, ఔషధ కల్తీలపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

మరింత సమర్థంగా నిర్వహించేందుకు.. పర్యవేక్షించేందుకు ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను విలీనంచేసి 'టీజీ సేఫ్(తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్)' పేరిట 'ఏకీకృత పరిపాలనా వ్యవస్థ'ను ఏర్పాటుచేసింది. ప్రస్తుతం తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని 'టీజీ సేఫ్'కు కమిషనర్‌గా నియమించింది. 'టీజీ సేఫ్' విధివిధానాలను పేర్కొంటూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రజలకు సురక్షితమైన ఆహారం, నాణ్యమైన ఔషధాలు అందేలా పర్యవేక్షణ, నిఘా, తనిఖీలు, చట్టపరమైన చర్యలను మరింత బలోపేతం చేయడమే ఈ ఏకీకృత వ్యవస్థ ప్రధాన లక్ష్యమని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆరోగ్యశాఖ అధికారులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ సమన్వయ విధానాలను ఇప్పటికే పరిశీలించారు. ప్రయోగశాలలు, న్యాయపరమైన సహాయం, మానవ వనరులు, సమన్వయంతో కూడిన సమాచార వ్యవస్థలను ఉమ్మడిగా వినియోగించడం వల్ల..ఆయా రాష్ట్రాల్లో అమలు సమర్థంగా జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోనూ ఆహార భద్రత, ఔషధాల్లో కల్తీల నియంత్రణకు ఏకీకృత నియంత్రణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగశాలలను బలోపేతం చేయడం, న్యాయపరమైన సహాయం అందించడం, మానవ వనరులను పెంచడం, చట్టబద్ధ అధికారులకు అమలు సహకారం అందించడం ఈ వ్యవస్థలో కీలకంగా ఉంటాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆహార సంబంధ వ్యాపారాలు నిర్వహించే వారు (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) 1,72,337 మంది ఉన్నారు. వీటిలో 64 శాతం సంస్థలు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధి ప్రాంతంలోనే ఉన్నాయి. అలాగే రాష్ట్రంలోని ఔషధ లైసెన్స్ పొందిన 51,594 మంది రిటైలర్లు, సుమారు 600 తయారీ యూనిట్లలో దాదాపు 50 శాతం క్యూర్ పరిధిలోనే ఉన్నాయి. అందుకే తొలిదశలో ఈ కొత్త వ్యవస్థను అక్కడే అమలు చేయనున్నారు.

## సమన్వయ లోపాన్ని అధిగమిస్తూ..

వ్యాపార సంస్థల సంఖ్యకు అనుగుణంగా చట్టబద్ధ అధికారులు అందుబాటులో లేకపోవడం ప్రస్తుతం సమస్యగా మారింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు.. వేర్వేరు విభాగాల్లో ఉండటంతో సమన్వయం లోపిస్తోంది. దీంతో ప్రస్తుత ఆహార భద్రత, ఔషధ నియంత్రణ వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించి ఆధునికీకరించాల్సిన అవసరం ఏర్పడింది. ఇక నుంచి ఆహార భద్రత, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలు.. ఉమ్మడి పరిపాలన, ఎన్‌ఫోర్స్‌మెంట్, లేబొరేటరీ, నిఘా, డేటా విశ్లేషణ, న్యాయపరమైన వ్యవస్థలతో సమన్వయంగా పనిచేయనున్నాయి. వీరికి



తోడుగా అవసరమైన పోలీసు సిబ్బందిని డీజీపీ సమకూర్చనున్నారు. ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం, డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం కింద పనిచేసే చట్టబద్ధ అధికారులకు.. పోలీసు శాఖ అధికారులు సహకారం అందించనున్నారు. పరిపాలనా విభాగాల విలీనం జరిగినప్పటికీ..ఇప్పటికే అమల్లో ఉన్న చట్టపరమైన వ్యవస్థ, లైసెన్సుల పర్యవేక్షణ, దర్యాప్తులు, కోర్టు వ్యవహారాలు యథాతథంగా కొనసాగుతాయి. ఇప్పటికే మంజూరైన పోస్టుల్లో ఖాళీలను డిప్యుటేషన్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. 'టీజీ సేఫ్' అమలుకు అవసరమైన బడ్జెట్, లాజిస్టిక్స్, ఇతర సహాయక సేవలను కూడా సమకూర్చనుంది. చట్టపరమైన తనిఖీలు, నమూనాల సేకరణ, అనుమతులు, ప్రాసిక్యూషన్ వంటి చర్యలను సంబంధిత చట్టాల ప్రకారం అర్హత కలిగిన ఫుడ్ లేదా డ్రగ్స్ అధికారులు మాత్రమే చేపడతారు. ఏదైనా ఫిర్యాదు అందినప్పుడు..అది ఆహార భద్రతకు సంబంధించిం దా లేదా ఔషధ నియంత్రణ సంబంధమైనదా అనే అయోమయం లేకుండా ఒకే ఫిర్యాదు కేంద్రం ఏర్పాటు చేయను న్నారు. సదరు ఫిర్యాదును సంబంధిత విభాగానికి పంపించి త్వరగా పరిష్కరించేలా వ్యవస్థను రూపొందించనున్నారు.

## ఆధునికీకరణకు రాష్ట్రస్థాయి కమిటీ

ఆహార వ్యాపారాలు, ఔషధ సంస్థల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థను ఆధునికీకరించేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఏకీకృత వ్యవస్థ, సర్వీస్‌రూల్స్ సమన్వయం, సిబ్బంది అవసరాలు, తనిఖీలు, పరీక్షలు, న్యాయపరమైన సహకారం, నిఘా, డేటా విశ్లేషణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ విధానాలకు అనుగుణంగా 'సాంకేతిక ఆధారిత నియంత్రణ వ్యవస్థ' ఏర్పాటుకు సూచనలు చేయనుంది. క్యూర్ ప్రాంతంలో 'టీజీ సేఫ్' అమలుతో వచ్చే ఫలితాలను కూడా కమిటీ సమీక్షించి, రాష్ట్రవ్యాప్తంగా 'ఏకీకృత ఫుడ్ అండ్ డ్రగ్ విభాగం' ఏర్పాటుపై తుది సిఫార్సులు చేయనుంది.

# కిరాణ దుకాణానికి వచ్చే ఒంటరి మహిళలే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించారు. విచారణలో భాగంగా సీసీ కెమెరాల ద్వారా భూంపల్లి గ్రామానికి చెందిన చాకలి రజిత, ఆమె కుమారుడిని నిందితులుగా గుర్తించారు. వీరు స్థానికంగా కిరాణ దుకాణం, టీస్టాల్ నిర్వహిస్తున్నారు. రజిత భర్త అనారోగ్యంతో బెడ్‌పై ఉంటున్నాడు. రజిత తన మైనర్ కుమారుడితో కలిసి ఒంటరి మహిళలను హత్య చేసి, బంగారు ఆభరణాలు దొంగిలించి, వాటిని విక్రయించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగానే వీరి ఇంటికి దగ్గర్లో ఒంటరిగా ఉంటున్న అతికం విజయ ఈ నెల 8న కిరాణ షాప్‌నకు రాగా ముందస్తు ప్రణాళిక ప్రకారం లోపలికి పిలిచి ఆమెను హత్య చేసి బంగారు ఆభరణాలు తీసుకున్నారు. అదే రోజు రాత్రి మృతదేహాన్ని ఎక్స్‌ఎల్ వాహనంపై రామక్కపేట శివారులో పెట్రోల్ పోసి కాల్చేశారు. ఈ ఏడాది మే 28న వీరి ఇంటి దగ్గర్లో నివాసముండే కుంట రేఖ కూడా కిరాణ షాపునకు రాగా ఆమెను కూడా హత్య చేసి, అచ్చుమాయిపల్లి గ్రామ శివారులో కాల్చవేశారు. 2025 జూన్‌లో భూంపల్లి గ్రామానికి చెందిన అన్నపూర్ణ ఉదయం వాకింగ్ చేస్తుండగా ఆమెపై దాడి చేసి 5 తులాల బంగారు పుస్తెలతాడును చోరీ చేశారు. మరో నలుగురు మహిళలను కూడా హత్య చేసి, వారి నుంచి బంగారం చోరీ చేయాలనే ప్రణాళిక రూపొందించినట్టు పోలీసుల విచారణలో చెప్పింది. అయితే అనారోగ్యంతో మంచంపై ఉన్న భర్తను కూడా హత్య చేయాలని నిందితురాలు ప్రణాళిక రచించిందని, ఇందుకు ఇన్సూరెన్స్ చేయించాలని ప్లాన్ చేసిందని పోలీసులు తెలిపారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని ఆమె నుంచి రూ.10 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వా దీనం చేసుకున్నారు. మహిళలను హత్య చేయడానికి కుమారుడిని అన్ని విధాలు గా సిద్ధం చేసింది. దుకాణంలోనే జిమ్‌ను ఏర్పాటు చేయించి కొడుకుతో వ్యాయామం చేయించేది. దుకాణంలో పలు రకాల వ్యాయామ పరికరాలను పోలీసులు గుర్తించారు.



# 1,000 పడకల టిమ్స్ ప్రారంభం నేడే

(మొదటిపేజీ తరువాయి)

వసతులను సిద్ధం చేశారు. ఇటీవల ట్రయల్ రన్, డే కేర్ విభాగాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించి రోజుకు 250 మంది రోగులకు సేవలందించారు. టిమ్స్ సనత్‌నగర్‌కు మాజీ డీఎంఈ డా.ఎ.నరేంద్రకుమార్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా, మాజీ ఏడీఎంఈ డా.మహబూబ్ ఖాన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రుల నుంచి తీసుకున్న వారితో పాటు ఇటీవల కొత్తగా రిక్రూట్ చేసిన సుమారు 200 మంది వైద్య సిబ్బంది టిమ్స్‌లో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారు. డా.ఎంసీఆర్ టిమ్స్ (సనత్‌నగర్) ప్రారంభోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం టిమ్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న సందర్భంగా ఆదివారం టిమ్స్‌లో మంత్రి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రారంభోత్సవానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, వైద్యులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో లోపాలు జరగకుండా పోలీసు, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. డా.ఎంసీఆర్ టిమ్స్ వైద్య రంగంలో ఒక ముఖ్యమైన కార్యక్రమమని దీనిని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మంత్రి వెంట ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డా.క్రిస్టినా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డా.సంగీత సత్యనారాయణ ఇతర అధికారులున్నారు.

# నేటి నుంచి మండల స్థాయిలో ప్రజావాణి

(మొదటిపేజీ తరువాయి)

విస్తరించి.. అక్కడే సమస్యలు పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మండలస్థాయి ప్రజావాణికి ఎంపీడీవోలను నోడల్ అధికారులుగా నియమించి..వారికి ఇటీవల హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శిక్షణ ఇచ్చింది. ప్రజావాణి నిర్వహణపై గ్రామాల్లో చాటింపు వేయడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో సూచించింది. రాష్ట్రంలో 152 మండల కేంద్రాల్లో సొంత భవనాలు లేవు. అద్దెభవనాల్లోనే అర్జీల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని సూచించింది. ప్రతి కార్యాలయంలో మౌలిక వసతులు తప్పనిసరి అని పేర్కొంది. ప్రజావాణి నిర్వహణకు డేటా ఎంట్రీ ఆపరేటర్లు/ హెల్ప్‌డెస్క్ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతి వేదిక వద్ద కంప్యూటర్, స్కానర్, ఇంటర్నెట్ కనెక్టివిటీని సమకూర్చింది. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవోలతో పాటు తహసీల్దార్, వ్యవసాయ, ఉద్యాన, విద్య, వైద్య, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, విద్యుత్, మత్స్య, గృహనిర్మాణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమ శాఖలు, అటవీ, అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, స్థానిక ఎస్సైలు హాజరవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రజలు తమ సమస్య, చిరునామా, మొబైల్ నంబరును పేర్కొంటూ ఇచ్చే లిఖిత పూర్వక వినతులను స్వీకరించిన వెంటనే వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, ప్రతి అర్జీని పోర్టల్‌లో నమోదు చేసి, రిజిస్ట్రేషన్ నంబరు ఇవ్వాలని పేర్కొంది. ఈ నంబరుతో ఫిర్యాదు స్థితిని ప్రజలు ట్రాక్ చేయొచ్చని తెలిపింది.



కౌమార, యవ్వన దశలో మెదడులో చాలా మార్పులు జరుగుతుంటాయి. ఇది 25 ఏళ్ల వరకూ వృద్ధి చెందుతూనే వస్తుంది మరి. యువతీ యువకులుగా మారుతున్న క్రమంలో విద్య, ఉద్యోగ, సమాజ పరంగా సవాళ్లను ఎదుర్కోవాల్సిన తరుణంలో తప్పటడుగు వేస్తే జీవితం గాడి తప్పుతుంది. ఇలాంటి సమయంలో మెదడును లోబరచుకునే గంజాయి వలలో చిక్కితే ఇంకేమైనా ఉందా? చిన్న వయసులో దీని ప్రభావం మరింత ఎక్కువగా పడుతుంది. కొద్దిగా వాడినా దీర్ఘకాలం దుష్ప్రభావాలు వెంటాడుతూ వస్తాయి. అయితే మనదగ్గర సగటున 18.4 ఏళ్లలోనే గంజాయికి అలవడుతుండటం దురదృష్టకరం.

## బయట పడేయొచ్చు

గంజాయి వ్యసనం నుంచి బయటపడేసే మార్గం లేకపోలేదు. అనుమానం వచ్చిన వెంటనే మానసిక నిపుణులను సంప్రదించాలి. ఇది చాలా ముఖ్యం. ఆయా లక్షణాలను బట్టి వ్యసనానికి లోనయ్యారో, లేదో గుర్తిస్తారు. ఏ వయసులో ఆరంభించారు? ఎంత మొత్తం తీసుకుంటున్నారు? ప్రవర్తనలో వచ్చిన మార్పులేంటి? దుష్ప్రభావాలు, మానసిక సమస్యలు ఎప్పుడు మొదలయ్యాయి? అనేవి నిశితంగా విశ్లేషిస్తారు. ప్రస్తుత మానసిక స్థితిని బట్టి మెదడు ఎంతవరకు ప్రభావితమైందో అంచనా వేస్తారు. వీటన్నింటి ఆధారంగా చికిత్సను నిర్ణయిస్తారు.

- ముందుగా అవగాహన కలిగించేలా, మూడ్ మెరుగుపడేలా కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రతికూల భావనల నుంచి మనసును మళ్లించి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవటానికి తోడ్పడే పద్ధతులను, వ్యూహాలను నేర్పిస్తారు.
- ఏడీహెచ్‌డీ, సాహసాలకు ఒడిగట్టే స్వభావం వంటి ఇతరత్రా ప్రవర్తన సమస్యలేవైనా ఉన్నట్టయితే వాటికీ చికిత్స చేస్తారు.
- గంజాయిని మానేసినప్పుడు మొదట్లో కొన్ని వారాల పాటు విత్‌డ్రాయల్ లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇవి రెండు వారాల వరకూ తీవ్రంగా ఉంటాయి. అందువల్ల వీటిని తగ్గించటానికి సంతోషాన్ని కలిగించే మందులు అవసరమవుతాయి. తాము చేసే పనులతోనే ఆనందాన్ని పొందే గుణం అలవడే వరకూ వీటిని వేసుకోవాల్సి ఉంటుంది.
- కౌన్సెలింగ్, మందులతోనే చాలావరకూ బాగుపడే అవకాశముంది. అయితే దీన్ని ఏదో ఒకరోజు సమస్యగా భావించరాదు. దీర్ఘకాలిక జబ్బు మాదిరిగా ఎక్కువకాలం చికిత్స అవసరమని గుర్తించాలి. సమస్య మరీ తీవ్రంగా ఉన్నవారిని కొద్దికాలం ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాల్సి వస్తుంది.

# గంజాయి మత్తు.. యువత చిత్తు



గంజాయి మూలంగా మెదడులో భావోద్వేగాలను అదుపులో ఉంచే అమిగ్దల.. పనులను చేయటానికి, నిర్ణయాలు తీసుకోవటానికి తోడ్పడే ప్రిఫ్రాంటల్ కార్టెక్స్ భాగాల ఎదుగుదల బాగా కుంటుపడుతుంది. ఇది రకరకాల సమస్యలకు దారితీస్తుంది. గంజాయి మత్తులో ఉన్నప్పుడు ఆలోచనలు కోటలు దాటుతుంటాయి. ఏవేవో గొప్ప గొప్ప కార్యాలు చేస్తామని కోతలు కోస్తుంటారు. కానీ వాస్తవం వేరు. ఏకాగ్రత కొరవడటం వల్ల చదువులు దెబ్బతింటూ వస్తుంటాయి. మిగతావారి కన్నా తక్కువ మార్కులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. లక్ష్యం కోసం పోరాడే, పాటుపడే గుణం కోల్పోవచ్చు. ఫలితంగా ఉద్యోగ, వ్యాపారాల్లో రాణించలేక దిగువ స్థాయిలోనే ఉండిపోతారు.

## అనుచిత సాహసాలు, ప్రమాదాలు:

మెదడులో కార్యనిర్వాహక, కదలికలను నియంత్రించే వ్యవస్థలు ప్రభావితం కావటం వల్ల నిర్ణయాలు తీసుకునే శక్తి సన్నగిల్లుతుంది. దీంతో అనుచిత పనులకు, సాహసాలకు ఒడిగడుతుంటారు. ప్రమాదాల బారినపడుతుంటారు. గంజాయి వాడేవారికి రోడ్డు ప్రమాదాల ముప్పు 8-9 రెట్లు ఎక్కువ. అనుచిత లైంగిక కార్యకలాపాలకూ పాల్పొడొచ్చు. ఫలితంగా ఇన్‌ఫెక్షన్లు, అవాంఛిత గర్భాలు రావొచ్చు.

### మానసిక సమస్యలు:

గంజాయి వ్యసనం ఆందోళన, కుంగుబాటు, ఆత్మహత్య ఆలోచనలనూ ప్రేరేపిస్తుంది. మానసిక బలహీనతకూ దారితీస్తుంది.

**తీవ్ర జబ్బులు:** గంజాయిని పొగ రూపంలో తీసుకుంటే సిగరెట్ల మాదిరిగానే గుండెజబ్బు, పక్షవాతం, క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. ఆకు, పువ్వు భాగాల్లో ఉండే ఫంగస్, రసాయనాలు గాలి గదుల లోపలి పైపొర మీద నేరుగా ప్రభావం చూపుతాయి. ఇది బ్రాంకైటిస్, ఆస్థమా వంటి జబ్బులకూ దారితీస్తుంది. గంజాయితో ఊపిరితిత్తి క్యాన్సర్ ముప్పు 1.5 రెట్లు ఎక్కువగా ఉంటుండటం గమనార్హం. గంజాయి మూలంగా ఇతర మాదకద్రవ్యాల అలవాటూ కావొచ్చు. ఇది మరింత ప్రమాదకరం.

### నమిలి తీసుకుంటే మరింత ప్రమాదం

ఇప్పుడు చాక్లెట్లు, బ్రౌనీస్, కేక్స్, పకోడీల రూపంలోనూ గంజాయిని తీసుకుంటున్నారు. ఇదింకా ప్రమాదకరం. నమిలి తిన్నట్టయితే ఒంట్లో ఎక్కువసేపు ఉంటుంది. అతిగానూ తీసుకునే ప్రమాదముంది. పొగ రూపంలోని గంజాయి నిమిషాల్లోనే మెదడు మీద ప్రభావం చూపుతుంది. అదే చాక్లెట్ల రూపం లోనైతే అరగంట నుంచి గంట వరకూ పట్టొచ్చు. దీంతో ప్రభావమేమీ చూపటం లేదని ఎక్కువెక్కువగా తీసుకుంటారు.

### లోబరచుకుంటుంది జాగ్రత్త

పొగ, మద్యం మాదిరిగానే గంజాయి కూడా వ్యసనానికి దారితీస్తుంది. దీనికి కారణం మెదడును ఉత్తేజితం చేసే డెల్టా-9-టెట్రాహైడ్రోకెన్నబినాల్ రసాయనం. ఇది డొపమిన్ వంటి రసాయనాల విడుదలను ప్రేరేపించి, కృత్రిమ ఆనందాన్ని కలిగిస్తుంది. దాని కోసం తహతహలాడేలా చేస్తుంది. ఏం చేసైనా దాన్ని పొందాలనే కోరిక కలగజేస్తుంది. ఇదే వ్యసనం. చిన్న వయసులో గంజాయి రుచికి అలవడితే వ్యసనంగా మారే అవకాశం రెండు రెట్లు ఎక్కువ!

## అలవాటును అనుమానించేదెలా?

- హఠాత్తుగా కొత్త కొత్త పరిచయాలు ఏర్పడటం
- ఫోన్‌లో రహస్యంగా, అర్ధరాత్రుల్లో చాటింగ్
- శుభ్రతను పట్టించుకోకపోవటం, మురికి దుస్తులను ధరించటం
- ఎక్కువగా చిరాకు పడటం, కోపం తెచ్చుకోవటం
- గతంలో ఇష్టమైన పనుల మీద ధ్యాస పెట్టకపోవటం
- రాత్రనకా పగలకనకా ఎక్కువసేపు స్నేహితులతోనే ఉండిపోవటం
- తరచూ ఎర్రబడిన కళ్లతో కనిపించటం
- కళ్లు మగతగా, మూతపడినట్టుగా అనిపించటం
- దుస్తులు కుళ్లిపోయినట్టుగా ఒకమాదిరి వాసన వేయటం
- చర్మం మీద నూనె, టింక్చర్ రాసుకున్నట్టుగా మరకలు
- చాటింగ్‌లో షాటర్, డంబ్ వంటి సంకేత పదాలు వాడటం
- అసాధారణ మతిమరుపు.
- జేబుల్లో, బ్యాగుల్లో పైపులు, లైటర్లు, రోలింగ్ పేపర్ల వంటివి ఉండటం
- వేళకాని వేళ ఇంటికి రావటం



- మామూలుగా కన్నా అతిగా తినటం
- చేతికిచ్చిన డబ్బుకు లెక్క చెప్ప లేకపోవటం, డబ్బులు దొంగిలించటం
- కొన్నిసార్లు పెద్దమొత్తంలో డబ్బు ఖర్చుపెట్టటం.
- బ్యాంకు ఖాతా లేదా కార్డుల ద్వారా ఎక్కువగా లావాదేవీలు జరగటం.

ఇలాంటివి గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే అనుమానించాలి. వారితో మనసు విప్పి మాట్లాడాలి. అలాగని తగాదా పెట్టుకోవద్దు. అన్నింటికన్నా ఇల్లే సురక్షితమైందనే వాతావరణం సృష్టించాలి. తప్పుడు పనులు చేస్తే జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని అవగతమయ్యేలా చూడాలి. వారు ఎదుర్కొంటున్న సమస్యలేంటో తెలుసుకోవాలి. వాటిని పరిష్కరించటానికి గంజాయి మార్గం కాదని నచ్చజెప్పాలి. నలుగురితో కలవటానికి, ధైర్యంగా మెలగటానికి అది అవసరం లేదని అర్థమయ్యేలా చెప్పాలి. పార్టీల్లో, వేడుకల్లో సంగీతం వింటూ, డ్యాన్స్ చేస్తూ, రుచికరమైన వంటకాలు తింటూ కూడా ఆనందాన్ని పొందొచ్చని.. ఇందుకు మాదక ద్రవ్యాలు మార్గం కాదనే సంగతిని బలంగా, మనసుకు హత్తుకునేలా తెలియజేయాలి. దీంతోనే కొందరు మారొచ్చు.



# ఉద్యాన పంటలపై ఎల్‌నినో ప్రభావం

- నివారణకు చర్యలు
- ఎల్ నినో అంటే ఏమిటీ..?
- ఎల్‌నినోను తగ్గించేందుకు చర్యలు
- ఎండలను తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలి
- శ్రీధర్, మేడ్చల్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి

**కార్తులెన్నో ఆయనో, కాలమే అయి-ఎపోయేనో, తేమ లేక జొన్న చేను చెమ్మగిల్లి పోయెను అని ఓ కవి వర్షాభావ పరిస్థితులతో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తు చేస్తూ రాసిన పాట ఇది. ఇది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోనూ, అలాగే, మేడ్చల్ - జిల్లాలోనూ నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అద్దం పట్టేలా ఉందనడంలో ఏ మాత్రమే సందేహం లేదు.**



మేడ్చల్ : జూన్ మాసంలో ప్రారంభమయ్యే వర్షాలు జూన్,జులై రెండు మాసాలు గడిచిపోయి మూడవ నెల ఆగస్టు మాసంలోకి ప్రవేశించాం. అయినా ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క వర్షం కూడా చెరువుల్లోకి నీరచ్చే వర్షం కురియలేదు. దీనితో, వర్షాల మీద ఆధారపడి పండించే పంటలు వరి, మక్కజొన్న, పల్లి, చెరుకు లాంటి పంటలు పండించే పరిస్థితి లేకుండా పోయింది. కేవలం బోర్లు, బావుల ఉన్న రైతులు మాత్రమే వరి సాగు చేసుకునే పరిస్థితి నెలకొన్నది. అది కూడా తక్కువ వ్యవధిలో చేతికి వచ్చే రకాలు మాత్రమే. ఈ పరిస్థితిలో జిల్లాలో రైతులు ఉద్యాన పంటల సాగుపైనే ఆశలు పెట్టుకున్నారు.

### ఉద్యాన పంటల సాగుకు పెట్టింది పేరు మేడ్చల్ జిల్లా :

ఉద్యాన పంటల సాగుకు పెట్టింది పేరు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా. ఈ జిల్లాలో ఉద్యాన పంటలు – కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్ల తోటలు సాగు జరుగుతుంది. హైదరాబాద్ మహానగరం అవసరాలను తీరుస్తున్న జిల్లాలో మేడ్చల్ జిల్లా కూడా ఒకటి. అయితే, ఈ సారి ఎల్ నినో ప్రభావం ఉద్యాన పంటల సాగుపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని, అందువల్ల రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు సాగు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆ వివరాలు ఇలా :

### ఎల్ నీనో అంటే ఏమిటి ?

- ఎల్ నీనో వల్ల వర్షాలు తక్కువగా పడతాయి.
- ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి.
- ఎండలు ఎక్కువ రోజులు ఉంటాయి.
- దీనివల్ల నీటి కొరత ఏర్పడి పంటల పెరుగుదల దిగుబడి తగ్గుతుంది.

### ఉద్యాన పంటలపై ఎల్ నీనో ప్రభావాలు

- నీటి కొరత వల్ల మొక్కలకు ఒత్తిడి.
- పూత, కాయల ఏర్పాటులో తగ్గుదల.
- పండ్ల పరిమాణం మరియు నాణ్యత తగ్గుతుంది.
- పూలు, కాయలు రాలిపోతాయి.
- దిగుబడి తగ్గుతుంది.
- పురుగులు, తెగుళ్ల ఎక్కువగా వస్తాయి.
- నర్సరీ మరియు చిన్న మొక్కలు ఎండిపోతాయి.
- నేలలో తేమ తగ్గుతుంది.
- సాగునీటి ఖర్చు పెరుగుతుంది.

### ఎల్ నీనో ప్రభావాన్ని తగ్గించే చర్యలు

1. నీటి సంరక్షణ
- డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులు ఉపయోగించాలి
- ప్లాస్టిక్ మల్చింగ్ చేయాలి
- ఫామ్ పాండ్లు, రీచార్జ్ గుంతల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయాలి
- పంటకు అవసరమైన ముఖ్య దశల్లో మాత్రమే నీరు ఇవ్వాలి

2. పంటల నిర్వహణ
- తక్కువ కాలంలో పండే కూరగాయల పంటలు సాగు చేయాలి.
- పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఉద్యాన పంటలను విభిన్నంగా సాగు చేయాలి.
- ఎండను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి.
- ఎక్కువ నీరు అవసరమైన పంటలకు బదులుగా తక్కువ నీరు అవసరమైన ఉద్యాన పంటలు సాగు చేయాలి.

3. నేల తేమ సంరక్షణ
- పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువులు వేయాలి.
- మొక్కల చుట్టూ మల్చింగ్ చేయాలి.
- కలుపు మొక్కలను తొలగించాలి.
- నేల సంరక్షణ పద్ధతులు పాటించాలి.







4. ఉద్యాన శాఖా ద్వారా ప్రభుత్వ సబ్సిడీలను ఉపయోగించుకోవాలిలిలి
- డ్రిప్ ఇరిగేషన్ (70–90 శాతం )
- స్ప్రింక్లర్ ఇరిగేషన్ (65 శాతం )
- ప్లాస్టిక్ మల్చింగ్(50)
- షేడ్ నెట్ 50
- కూరగాయల సాగు 40
- ఆర్. కె.వి.వై పర్మనెంట్ పందిళ్లు (50 శాతం ) (సపోర్ట్ సిస్టమ్‌లు)

ఎండను తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి... శ్రీధర్..మేడ్చల్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి

నీటి సంరక్షణ, మల్చింగ్, ఎండను తట్టుకునే రకాలను సాగు చేసుకోవడం ద్వారా ఎల్ నీనో ప్రభావాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని మేడ్చల్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ సూచిస్తున్నారు.

# మీరు వాడుతున్న తేనె స్వచ్ఛమైనదేనా..?

## ఇలా గుర్తించండి..!



తేనెను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల విటమిన్లు, మినరల్స్, పోషకాలకు తేనె నిలయం. పలు అనారోగ్యాలను తగ్గించడంలో, శరీరానికి శక్తినివ్వడంలో తేనెకు అధిక ప్రాధన్యత ఉంది. ఆయుర్వేదంలోనూ తేనెను పలు ఔషధాలతోపాటుగా ఇస్తారు. అయితే ప్రస్తుత తరుణంలో తేనె వాడకం ఎక్కువవడంతో వ్యాపారులు దాన్ని కూడా కల్తీ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు స్వచ్ఛమైన తేనె ఏదో నకిలీ తేనె ఏదో గుర్తించడం కష్టతరమైంది. అయితే పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను ఇట్టే గుర్తించవచ్చు. దీంతో ఆరోగ్యంపై ప్రభావం పడకుండా జాగ్రత్తగా ఉండవచ్చు.



### నురగ వచ్చిందంటే..

ఇక సాధారణంగా మొలాసిస్, మొక్కజొన్న పిండి తదితర పదార్థాలను ఉపయోగించి నకిలీ తేనెను తయారు చేస్తారు. ఈ క్రమంలో నకిలీ తేనెను గుర్తించడం చాలా సులభమే అని చెప్పవచ్చు. కొద్దిగా తేనె తీసుకుని దానికి 2, 3 చుక్కల వెనిగర్ ఎస్సెన్స్ కలపాలి. అనంతరం వాటిని బాగా మిక్స్ చేయాలి. ఇలా వచ్చిన మిశ్రమం ఎక్కువగా నురగను విడుదల చేస్తుంటే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి. ఎందుకంటే నకిలీ తేనె కోసం ఉపయోగించే పదార్థాల్లో చక్కెర కూడా ఉంటుంది. ఇది వెనిగర్‌తో కలిసినప్పుడు నురగలాంటి ద్రవాన్ని ఇస్తుంది. అసలైన తేనె ఇలా నురగను ఇవ్వదు. అలాగే కొద్దిగా తేనెను తీసుకుని బొటనవేలిపై వేయాలి. అనంతరం దాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ తేనె చుక్క వేలిపై చుట్టూ విస్తరిస్తే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి.

### నీటిలో కలిపితే..

మీరు కొన్న తేనె అసలుదో, నకిలీదో గుర్తించాలంటే దాన్ని ఒక టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్ నీటిలో వేయాలి. నకిలీ తేనె అయితే వెంటనే నీటిలో కరుగుతుంది. అసలు తేనె గ్లాస్ అడుగు భాగంలోకి చేరుతుంది. అంతే తప్ప నీటిలో అంత త్వరగా కరగదు. అలాగే ఒక కాటన్ బాల్‌ను తీసుకుని దాన్ని తేనెలో ముంచాలి. అనంతరం దానికి అగ్గిపుల్లతో నిప్పు పెట్టాలి. అసలు తేనె అయితే కాటన్ బాల్ మండుతుంది. నకిలీ తేనె అయితే కాటన్ బాల్ మండదు. అదేవిధంగా ఒక తేనె చుక్కను గోరుపై వేసుకోవాలి. ఆ చుక్క గోరుపై అటు ఇటు కదిలితే అది నకిలీ తేనె అన్నమాట. అదే ఆ చుక్క కదలకుండా స్థిరంగా ఉంటే ఆ తేనెను అసలైందిగా భావించాలి.





### తేనెకు అసలు ఎక్స్‌పైరీ ఉండదు..

ఇక సాధారణంగా స్వచ్ఛమైన తేనె అయితే అసలు ఎక్స్‌పైరీ ఉండదు. కానీ మనకు మార్కెట్‌లో లభించే తేనెలో కొందరు రసాయనాలు కలుపుతారు. కనుక మనం కొనే తేనెకు ఎక్స్‌పైరీ ఉంటుంది. కానీ సహజసిద్ధంగా కొన్న తేనె అయితే ఎన్ని రోజులు ఉన్నా పాడవదు. రోజులు గడిచే కొద్దీ ఇంకా రుచి పెరుగుతుంది. మార్కెట్‌లో మీరు తేనె కొంటే వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన తేనె అయితే మంచిది. అది కల్తీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలా పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను గుర్తించడంతోపాటు దాన్ని కొనకుండా జాగ్రత్త పడవచ్చు.



# సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభం

**శేరిలింగంపల్లి, ఆగస్టు 16 (జనం వార్త):** ఆల్విన్ కాలనీ హనుమాన్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ను ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్‌తో పాటు పలువురు కాలనీ పెద్దలు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరేకపూడి గాంధీ మాట్లాడుతూ సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ సుకన్యను అభినందించారు. హనుమాన్ నగర్, ఆల్విన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్నందున వారికి అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. క్లినిక్‌లో సాధారణ వైద్యం, మాటల చికిత్స, ఫిజియోథెరపీ వంటి వివిధ వైద్య సేవలతో పాటు అవసరమైన వైద్య నిపుణులు అందుబాటులో ఉండటం అభినందనీయమని గాంధీ అన్నారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ క్లినిక్ మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. అనంతరం క్లినిక్ నిర్వాహకులు మాట్లాడుతూ పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు, చికిత్స అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, వైద్య నిపుణులు, క్లినిక్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాగం సుజాత యాదవ్ సేవలు చిరస్మరణీయం

## డాక్టర్ ఎన్. రఘువీర రెడ్డి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 16(జనం వార్త):** తెలంగాణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి మాజీ చైర్‌పర్సన్, ప్రముఖ సామాజిక సేవకురాలు కీ.శే. రాగం సుజాత యాదవ్ మృతి పట్ల ఏఐసీసీ సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. రఘువీర రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం నల్లగండ్లలోని మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాగం సుజాత యాదవ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. రాగం సుజాత యాదవ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు విశేషంగా కృషి చేశారని డాక్టర్ రఘువీర రెడ్డి పేర్కొన్నారు. సామాజిక సేవా రంగంలో ఆమె చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ప్రజా సంక్షేమం, మహిళల అభివృద్ధి, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఆమె చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసిన రాగం సుజాత యాదవ్ మృతి సామాజిక రంగానికి తీరని లోటని డాక్టర్ రఘువీర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె సేవా స్ఫూర్తి, ఆశయాలను భవిష్యత్ తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద సమయంలో రాగం నాగేందర్ యాదవ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. భగవంతుడు రాగం సుజాత యాదవ్ ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొని రాగం సుజాత యాదవ్‌కు నివాళులర్పించారు.



# ఎంపీ, ఎమ్మెల్యేను కలసిన నాయకులు

## ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

**నాగారం,ఆగస్టు 16 (జనం వార్త) :** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లను మాజీ చైర్మన్ చంద్రారెడ్డి తో కలిసి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నంరాజు శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాగారం డివిజన్ పరిధిలోని శ్రీ రామ సత్యనారాయణ స్వామి,సాయిబాబా దేవస్థానం 18వ వార్షికోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారగం ఉమాశంకర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో జర్నలిజంలో ప్రతిభ చూపిన శ్రవణ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

## ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన ఫోటోకు అవార్డు

**కూకట్‌పల్లి, ఆగస్టు 16,( జనం వార్త) :** తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్ట్ ల ఆధ్వర్యంలో ఈ సంవత్సరం నిర్వహించిన న్యూస్ ఫోటో కాంపిటీషన్ లో కూకట్‌పల్లి నమస్తే తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా తీసిన ఫోటోకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఫోటో న్యూస్ రూపంలో వెలుగులోకి తీసుకురావడం, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. జర్నలిజం ద్వారా ప్రజాసేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తన కృషిని గుర్తించి అవార్డుతో సత్కరించిన తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్ట్స్ కమిటి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను కెమెరా కంటితో చూపిస్తూ, సమాజానికి ఉపయోగపడే కథనాలకు మరింత ప్రాధాన్యం ఇస్తానని ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.





# భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ

## వజ్రేష్ యాదవ్ సహకారంతోనే అభివృద్ధి.

**నాగారం,ఆగస్టు 16(జనం వార్త) :** సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ అధ్యక్షులు భూమయ్య యాదవ్ అన్నారు. మేడ్చల్ ఇన్‌చార్జ్ డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ సహకారంతో నాగారం డివిజన్ పరిధిలోని సుచిత్ర కాలనీలో సుమారు 21లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి,బలరాజ్ యాదవ్,పొట్ట శ్రీశైలం, దొడ్డి బాలనరసింహ, కాలనీ అధ్యక్షులు రమేష్, ఆల్ కాలనీల జనరల్ సెక్రటరీ ప్రవీణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షోభంలో బత్తాయి సాగు

## అస్థిత్వం కోసం నల్గొండ రైతు పోరాటం!

- ఒకప్పుడు దేశానికే దిక్సూచిగా నిలిచిన నల్గొండ బత్తాయి
- నేడు విధానపరమైన వైఫల్యాలు, మార్కెట్ దోపిడీ
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్థిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది

ఒకప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 4.5 లక్షల ఎకరాలకు పైగా బత్తాయి సాగు విస్తరించి ఉండేది. దేశంలోనే నాణ్యమైన బత్తాయి ఉత్పత్తికి ఈ ప్రాంతం చిరునామాగా నిలిచింది. దేశంలోని పలు రాష్ట్రాలకు, విదేశాలకు కూడా ఇక్కడి నుంచి బత్తాయి ఎగుమతులు జరిగేవి.

ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ఈ రంగం, నేడు 40 వేల ఎకరాల లోపే పరిమితమవడం ఉద్యాన రంగానికి తీవ్రమైన హెచ్చరిక. వేలాది ఎకరాల్లో బత్తాయి తోటలు నరికివేయబడ్డాయి. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ప్రకృతి సృష్టించిన సంక్షోభం కాదు... విధానాల వైఫల్యం, మార్కెట్ నిర్లక్ష్యం సృష్టించిన సంక్షోభం.

### పామాయిల్‌కు ప్రాధాన్యం... బత్తాయికి ప్రోత్సాహం ఎక్కడ?

ప్రస్తుతం ప్రభుత్వం, ఉద్యాన శాఖ పామాయిల్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. కొత్త పంటలను ప్రోత్సహించడం అవసరమే. అయితే దశాబ్దాలుగా నల్గొండ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బత్తాయి సాగు పునరుద్ధరణకు అదే స్థాయిలో ప్రాధాన్యం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన మొక్కల సరఫరా, వైరస్ నియంత్రణ, శాస్త్రీయ సాగు పద్ధతులు, తోటల పునరుద్ధరణ, పరిశోధన, కోల్డ్‌చైన్, ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహం వంటి అంశాల్లో సమగ్ర కార్యాచరణ లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.





ఒకప్పుడు నల్గొండ అంటే బత్తాయి.. బత్తాయి అంటే నల్గొండ అనే స్థాయిలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. నేడు ఈ నేల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వేలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా, లక్షలాది వ్యవసాయ కార్మికులకు ఉపాధి వనరుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బత్తాయి సాగు నేడు అస్తిత్వ పోరాటం చేస్తోంది. ఒకప్పుడు రైతు ఇంట్లో సిరులు కురిపించిన ఈ పంట, ఇప్పుడు అప్పులు, నష్టాలు, నిరాశలకు ప్రతీకగా మారింది. ఇది కేవలం ఒక పంట సంక్షోభం కాదు. వ్యవసాయ విధానాల్లోని లోపాలు, మార్కెట్ వ్యవస్థ వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం, రైతు పట్ల పాలకుల నిరాసక్తతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం. ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన పంట క్షీణిస్తుంటే, దాని ప్రభావం రైతు కుటుంబాలకే పరిమితం కాదు. గ్రామీణ జీవన విధానంపైనా, ఉపాధిపైనా, రాష్ట్ర ఉద్యాన రంగంపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది.

### తక్షణం చేపట్టాల్సిన చర్యలు

- ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో పూర్తి స్థాయి సమీకృత బత్తాయి మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలి.
- బత్తాయికి గిట్టుబాటు ధర భరోసా కల్పించే విధానాన్ని అమలు చేయాలి.
- దళారుల ఆధిపత్యాన్ని అరికట్టి పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- తోటల పునరుద్ధరణకు ప్రత్యేక సబ్సిడీలు, వడ్డీలేని రుణాలు అందించాలి.
- వైరస్ నియంత్రణ, అధిక దిగుబడి రకాల అభివృద్ధికి ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి.
- జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, ప్యాకింగ్ కేంద్రాలు, ఎగుమతి సదుపాయాలు ఏర్పాటు చేయాలి.
- "నల్గొండ బత్తాయి పునరుజ్జీవన మిషన్" పేరుతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించాలి.

### ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్... ఇంకా నెరవేరని రైతు కల

నల్గొండ ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో ప్రత్యేక బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేసినప్పటికీ, బత్తాయి క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి స్థాయి కార్యకలాపాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. రైతులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా, ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదు. మార్కెట్ లేక రైతు ఇప్పటికీ దళారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు రైతుకే లేకపోవడం ఈ వ్యవస్థలోని అతిపెద్ద విషాదం.

### దళారుల చేతుల్లో ధరలు... నష్టాల్లో రైతులు

బత్తాయి ధరను నిర్ణయించేది రైతు కాదు... దళారులే అన్న విమర్శ చాలా కాలంగా వినిపిస్తోంది. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కక రైతు నష్టాల్లో కూరుకుపోతుంటే, మధ్యవర్తులే భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. పారదర్శక మార్కెట్ లేకపోవడం, నిల్వ సదుపాయాలు లేకపోవడం, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో లేకపోవడం రైతును మరింత బలహీనంగా మారుస్తున్నాయి.

### పెరిగిన పెట్టుబడి.. కూలిపోతున్న రైతు ఆర్థిక వ్యవస్థ

ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, విద్యుత్, సాగునీటి, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. మరోవైపు మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో రైతు ఆదాయం తగ్గిపోయింది. బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, బంగారం తాకట్టు... ఇవే నేటి బత్తాయి రైతు జీవితాన్ని నిర్వచిస్తున్న వాస్తవాలు. పంట కంటే అప్పులే పెద్ద భారం కావడంతో అనేక మంది రైతులు తమ తోటలను నరికివేసి ఇతర పంటల వైపు వెళ్లిపోతున్నారు.

### వ్యవస్థ మొత్తం స్పందించాల్సిన సమయం

బత్తాయి సాగును కాపాడాలంటే రైతు ఒక్కరి కృషి సరిపోదు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, మార్కెటింగ్ శాఖ, ప్రాసెసింగ్ పరిశ్రమలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు రావాలి.



### బత్తాయిని కాపాడటం.. తెలంగాణ ఉద్యాన రంగాన్ని కాపాడటమే

నల్గొండలో బత్తాయి సాగు క్షీణించడం అంటే కేవలం ఒక పంట తగ్గిపోవడం కాదు. అది వేలాది రైతు కుటుంబాల జీవనాధారం కోల్పోవడం, లక్షలాది వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతినడం, ఒక ప్రాంత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడడం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బత్తాయి రైతుకు మార్కెట్ భరోసా, గిట్టుబాటు ధర, శాస్త్రీయ సహాయం, ఆర్థిక రక్షణ కల్పించాలి. రైతు పండించిన పంటకు గౌరవప్రదమైన ధర దక్కినప్పుడే వ్యవసాయానికి భవిష్యత్తు ఉంటుంది. నల్గొండ బత్తాయిని కాపాడటం అంటే ఒక పంటను కాపాడటం కాదు... వేలాది రైతు కుటుంబాల భవిష్యత్తును, ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థను, తెలంగాణ ఉద్యాన రంగ అస్థిత్వాన్ని కాపాడటమే.

– జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు



# తొలి టెస్టులో భారత పట్టు

## తొలి ఇన్నింగ్స్‌లో 460/9
## మ్యాచ్‌కు వర్షం దెబ్బ

**గాలె :** తొలి టెస్టులో భారత జట్టు పట్టు కొనసాగిస్తోంది. రెండో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి శుభ్‌మన్‌సేన తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. 288/2తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు, ఇంకో 7 వికెట్లు కోల్పోయి 172 పరుగులు జోడించింది. మొదటి రోజు 131తో అజేయంగా నిలిచిన దేవ్‌దత్ పడిక్కల్ (167; 230 బంతుల్లో 15x4, 1x6) మరో 36 పరుగులు చేసి వెనుదిరిగాడు. వికెట్‌కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (51; 68 బంతుల్లో 4x4, 1x6) విలువైన అర్ధశతకం సాధించాడు. కుల్‌దీప్ యాదవ్ (12 బ్యాటింగ్), ప్రసిద్ధ్‌కృష్ణ (1 నాటౌట్) క్రీజులో ఉన్నారు. లంక స్పిన్నర్లు ప్రభాత్ జయసూర్య (4/109), కెషార నువంత (3/175) మెరుగైన ప్రదర్శన చేశారు. వర్షం వల్ల తొలి సెషన్ తుడిచిపెట్టుకుపోయి, ఆట చాలా ఆలస్యంగా ఆరంభమైన ఆదివారం ఆటలో ఆతిథ్య జట్టు స్పిన్నర్లు ప్రభాత్ జయసూర్య, నువంత మెరుగ్గానే బౌలింగ్ చేసినా.. భారత్ పటిష్ట స్థితికి చేరకుండా అడ్డుకోలేకపోయారు. తొలి రోజే శతకం సాధించిన పడిక్కల్.. మరిన్ని విలువైన పరుగులు చేశాడు. జురెల్ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మ్యాచ్‌లో చాలా సమయం వృథా కావడం, ముందు ముందు కూడా వర్ష ప్రభావం ఉండే అవకాశం ఉండడంతో టీమ్‌ఇండియా.. వేగంగా పరుగులు చేయడానికి ప్రయత్నించింది. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 27తో ఇన్నింగ్స్ కొనసాగించిన పంత్ (39).. ఎదుర్కొన్న తొలి బంతినే డీప్ మిడ్ వికెట్లో బౌండరీకి తరలించాడు. కానీ అతడు ఎంతో సేపు నిలవలేదు. రెండో రోజు ఎనిమిదో ఓవర్లోనే నువంత బౌలింగ్‌లో ఔటయ్యాడు. భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన పంత్.. దినుషకు దొరికిపోయాడు. టెస్టుల్లో నువంతకు ఇది తొలి వికెట్. తొలి రోజు 77 పరుగులు చేసి రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన రాహుల్ (82) క్రీజులోకి వచ్చాడు. కానీ మరో 5



పరుగులు మాత్రమే జోడించి నువంత బౌలింగ్‌లో నిష్క్రమించాడు. అయితే చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన సెంచరీ హీరో పడిక్కల్.. జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతడు 215 బంతుల్లో 150 పూర్తి చేసుకున్నాడు. అసిత బంతిని మిడ్‌వికెట్లో బౌండరీకి తరలించి అతడు ఈ మైలురాయిని అందుకున్నాడు. కానీ టీకి కొద్దిసేపు ముందు అతడు ఔట్ కావడంతో 38 పరుగుల అయిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. పడిక్కల్‌ను జయసూర్య బోల్తా కొట్టించాడు. ముందు కొచ్చి షాట్ కొట్టబోయి గురితప్పడంతో పడిక్కల్ స్టంపౌటయ్యాడు. జడేజా (13) ఎక్కువసేపు నిలవనప్పటికీ, బాధ్యతాయుతంగా ఆడిన జురెల్.. మానవ్ సుతార్ (24; 43 బంతుల్లో 2x4)తో కలిసి జట్టు స్కోరు 400 దాటించాడు. నువంత బౌలింగ్‌లో జురెల్.. డీప్ మిడ్‌వికెట్లో సిక్స్‌తో అలరించాడు. లహిరు కుమార ఓవర్లో రెండు ఫోర్లు కొట్టాడు. సుతార్ అతడికి మంచి సహకారాన్నిచ్చాడు. 66 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన జురెల్.. చివరికి జట్టు స్కోరు 432 వద్ద నిష్క్రమించాడు. సుతార్‌తో ఏడో వికెట్‌కు అతడు 55 పరుగులు జోడించాడు. ఆ తర్వాత సుతార్, సిరాజ్ (11) కూడా వెనుదిరగగా.. ప్రసిద్ధ్, కుల్‌దీప్ ఇన్నింగ్స్‌ను మూడో రోజుకు తీసుకెళ్లారు.



# భళా బంగ్లా

- ఆస్ట్రేలియాపై ఆస్ట్రేలియాలో ఘనవిజయం
- తొలి టెస్టులో కంగారూలకు ఘోరపరాభవం

ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో టెస్టు మ్యాచ్‌లో ఓడించడం పెద్ద జట్లకు కూడా సవాలే. అలాంటిది బంగ్లాదేశ్ ఆ అద్భుత ఘనతను సాధించింది. తమ క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద టెస్టు విజయాన్ని ఆ జట్టు డార్విన్‌లో ఆదివారం అందుకుంది. రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆరంభం నుంచి ఆధిపత్యం చలాయిస్తూ వచ్చిన బంగ్లా.. 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై సాధికారిక విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 161/4తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్.. 284 పరుగులకు ఆలౌటైంది. 43 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన కామెరూన్ గ్రీన్ (104; 201 బంతుల్లో) సెంచరీ సాధించాడు. గ్రీన్ పోరాటం ఆసీస్‌కు ఇన్నింగ్స్ ఓటమిని తప్పించింది కానీ, బంగ్లా గెలుపును మాత్రం ఆపలేకపోయింది. ఆ జట్టు ముందు కేవలం 57 పరుగుల లక్ష్యం నిలవగా.. 14.2 ఓవర్లలో ఒక వికెట్టే కోల్పోయి ఆ జట్టు విజయాన్నందుకుంది. తంజిద్ హసన్ డకౌటైనప్పటికీ.. షాద్మన్ ఇస్లామ్ (25), మొమినుల్ హక్



(30) అజేయంగా నిలిచి లాంఛనాన్ని పూర్తి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 198 పరుగులకే కుప్పకూలగా.. బంగ్లా 426 పరుగులు సాధించి, 228 పరుగుల భారీ ఆధిక్యాన్ని మూటగట్టుకోవడంతో ఆ జట్టు విజయానికి బాటలు పడ్డాయి. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసి బంగ్లా చారిత్రక విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించిన హసన్ మహ్మద్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టు ఈ నెల 22న మొదలవుతుంది.

# భారత్-చైనా పోరు 2-2తో డ్రా

## మహిళల హాకీ ప్రపంచకప్



మహిళల హాకీ ప్రపంచకప్‌ను భారత్ ఆశాజనకంగా మొదలుపెట్టింది. ఆదివారం బలమైన చైనాతో జరిగిన పూల్-డి పోరును భారత్ 2-2తో డ్రాగా ముగించింది. తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న ఎనిమిది మంది ప్లేయర్లతో బరిలోకి దిగిన భారత్‌కు ఇది మెరుగైన ఫలితమే. ఈ మ్యాచ్‌లో తొలి 30 నిమిషాల్లో సలీమా బృందమే ఎక్కువ శాతం ఆధిపత్యం ప్రదర్శించింది. 8వ నిమిషంలో నేహా నుంచి పాస్ అందుకున్న నవ్‌నీత్ కౌర్ గోల్ కొట్టి జట్టుకు ఆధిక్యాన్ని అందించింది. నవ్‌నీత్ ఆడిన షాట్ కార్నర్ నుంచి గోల్‌లోకి వెళ్లిపో యింది. కానీ కాసేపటికే భారత్‌కు షాక్ తగిలింది. తొలి క్వార్టర్ కొన్ని సెకన్లలో ముగుస్తుందనగా భారత గోల్‌కు సమీపంలో చైనా ప్లేయర్ జాంగ్ జియాకిని శిల్పి దాస్ పడేసింది. దీంతో ప్రత్యర్థికి పెనాల్టీ స్ట్రోక్ లభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ యింగ్ జాంగ్ (15వ) గోల్ చేసి స్కోరు సమం చేసిం ది. చైనా గోల్ కొట్టినా, శిల్పి అయిదు నిమిషాలు సస్పెండ్ అయినా.. భారత్ తగ్గలేదు. దాడులు ఆపలే దు. భారత ప్లేయర్లు ఎక్కువసేపు ప్రత్యర్థి గోల్‌కు సమీ పంలోనే కనిపించారు. అయితే ఫినిషింగ్ లోపించడం తో ఫలితం దక్కలేదు. 25వ నిమిషంలో చైనా గోల్ దగ్గరకు దూసుకెళ్లిన దీపిక.. పెనాల్టీ కార్నర్‌ను సంపాది ంచింది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకుంటూ గోల్ చేసి భారత్‌ను 2-1 ఆధిక్యంలో నిలిపింది. అక్కడి నుంచి డ్రాగన్ జట్టు ఎదురుదాడికి దిగింది. బల్జీత్ కౌర్ ఒక గోల్, గోల్‌కీపర్ సవిత రెండు గోల్స్ ఆపారు. అయితే మూడో క్వార్టర్‌లో చైనా దాడులకు ఫలితం దక్కింది. 39వ నిమిషంలో దొరికిన పెనాల్టీ కార్నర్‌ను మా నింగ్ గోల్ చేసి స్కోరును 2-2గా మార్చింది. తర్వాత ఆధిక్యం కోసం చైనా గట్టిగా ప్రయత్నించింది. ఆ జట్టు క్రీడాకా రులు 13 సార్లు భారత గోల్ సమీ పంలోకి చొచ్చుకొచ్చారు. నాలుగు పెనాల్టీ కార్నర్లు కూడా సంపాదిం చారు. కానీ బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థిని గోల్ చేయకుండా అడ్డుకు ని మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. మరో పూల్-డి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 4-0తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. డార్సీ (10వ), టెసా (13వ), ఎలిజబెత్ (30వ), సోఫీ హమిల్టన్ (41వ) ఇంగ్లాండ్‌ను గెలిపించారు. పూల్-సి మ్యాచ్‌లో బెల్జియం 3-2తో న్యూజిలాండ్‌పై గెలిచింది.

### ఆస్ట్రేలియా శుభారంభం

పురుషుల హాకీ ప్రపంచకప్‌లో మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా బోణీ కొట్టింది. పూల్-సి మ్యాచ్‌లో ఆ జట్టు 3-1తో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. జోయెల్ (7వ, 23వ), బ్లేక్ (27వ) ఆసీస్ తరఫున స్కోరు చేశారు. ఐర్లాండ్ జట్టులో అలిస్టర్ (54వ) గోల్ కొట్టాడు. పూల్-బి పోరులో బెల్జియం 3-2తో ఫ్రాన్స్‌పై గెలిచింది. నీల్సన్ (18వ), రోమన్ (45వ), హెండ్రిక్స్ (57వ) బెల్జియంను గెలిపించారు. ఫ్రాన్స్ జట్టులో ఇలియట్ (4వ), ఫ్లోరెంట్ (19వ) రాణించారు. పూల్-డి పోరులో ఇంగ్లాండ్ 4-1తో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. రష్‌మెర్ (13వ), వార్డ్ (29వ), హూపర్ (32వ), జేమ్స్ (48వ) ఇంగ్లాండ్ తరఫున గోల్స్ కొట్టారు. పాక్ జట్టులో ఏకైక గోల్‌ను అఫ్రాజ్ (51వ) సాధించాడు. పూల్-ఎ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 5-1తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. జేప్ (35వ, 50వ), డుకో (41వ), థియరీ (49వ), కొయెన్ (52వ) డచ్ జట్టును గెలిపించారు. కివీస్ తరఫున జేమ్స్ (24వ) గోల్ కొట్టాడు.

జనం వార్త





# సర్వైవల్ డ్రామాలో కళ్యాణి ప్రియదర్శన్

'లోకా' సినిమాతో బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టించడంతో పాటు తన నటనతో ప్రశంసలు పొందిన కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. బాలీవుడ్ స్టార్ హీరో రణ్ వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న అతిపెద్ద యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ప్రళయ్' లో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నారు. తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ముంబై పరిసర ప్రాంతాలలో అధికారికంగా ప్రారంభమైంది. బాక్సాఫీసు వద్ద సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధురంధర్', 'ధురంధర్ ది రివేంజ్' వంటి ఆల్-టైమ్ బ్లాక్‌బస్టర్ల తర్వాత రణ్ వీర్ సింగ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. ఈ చిత్రంలో రణ్ వీర్ హీరోగా కాకుండా నిర్మాణ భాగస్వామిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి అత్యంత క్రేజ్ ఉన్న పాన్-ఇండియా చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. 'స్కామ్ 1992', 'లూటేరే' వంటి మైండ్ బ్లోయింగ్ ప్రాజెక్ట్‌లను అందించిన దర్శకుడు జై మెహతా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. బిర్లా స్టూడియోస్ బ్యానర్‌పై అనన్య బిర్లా సమర్పిస్తుండగా, 'ట్రూ స్టోరీ ఫిల్మ్స్' నిర్మాణంలో హన్సల్ మెహతా, సాహిల్ సైగల్ నిర్మిస్తున్నారు. ప్రపంచం అంతమయ్యే అత్యంత భయంకరమైన పరిస్థితి ఎదురైనప్పుడు.. ముంబై నగర నేపథ్యంలో మనుషులు తమ వారి కోసం, ప్రాణాల కోసం చేసే ఉత్కంఠభరిత పోరాటమే ఈ సినిమా ప్రధాన కథాంశం అని టాక్. ఈ గ్రిప్పింగ్ సర్వైవల్ డ్రామాలో కళ్యాణి ప్రియదర్శన్ పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం.



# సరికొత్త కథాంశంతో వస్తున్న నిత్యామీనన్

తెలుగు, తమిళం, కన్నడ సినీ పరిశ్రమల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ బ్యూటీ నిత్యామీనన్. రీసెంట్‌గా 'తలైవాన్ తలైవి', 'ఇడ్లీ కడై' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, చిన్న విరామం తర్వాత ఒక సరికొత్త హారర్ డ్రామాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఒక విభిన్నమైన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. 'యామిరుక్కా బయమే' చిత్రంతో వినోదాత్మక హారర్ జోనర్‌లో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు డీకే ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు టాక్. డీకే మార్క్ కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్‌కు నిత్యామీనన్ వంటి పవర్‌ఫుల్ నటి తోడవ్వడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా, వచ్చే ఏడాది సమ్మర్ రేసులో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ థ్రిల్లర్ మూవీతో నిత్యామీనన్ బాక్సాఫీస్ వద్ద మరో హిట్ తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

# మరోసారి కన్నడ శ్రీనిధి శెట్టి?

విజయవంతమైన 'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి శ్రీనిధి శెట్టి. ఈ విజయపరంపరను కొనసాగిస్తూ 'హిట్ ది థర్డ్ కేస్', 'తెలుసు కదా' చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్నీ విశేషంగా అలరించింది. ఇప్పుడీ జోష్‌లోనే ఆమె ఓ కన్నడ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కథానాయకుడు కిచ్చా సుదీప్ నటించిన 'విక్రాంత్ రోనా' ఫేమ్ దర్శకుడు అనూప్ భండారి దర్శకత్వం వహించనున్న ఓ చిత్రంలో శ్రీనిధి నటించనున్నట్లు సమాచారం. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ సినిమా కథ, జానర్, నటీనటుల వివరాలను చిత్రనిర్మాతలు త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీనిధి, వెంకటేశ్ కథానాయకుడిగా.. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' చిత్రంలో నటిస్తుంది. మరి ఈ మధ్య కాలంలో వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్న ఈ భామ రాబోయే ఈ కన్నడ సినిమాలో ఎలాంటి మ్యాజిక్ చేయనుందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com